క్లుప్తంగా

ఆలయానికి పంచలోహ మకరతోరణం అందజేత



దాతను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరంలో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా కోదాడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ బుడిగం నరేష్‌- శ్రీలత దంపతులు రూ.50 వేల విలువగల పంచలోహ మకర తోరణాన్ని బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ కీసర విష్ణువర్ధన్‌రెడ్డి, ధర్మకర్త కీసర లలితారెడ్డి, సర్పంచ్ పగడాల పద్మప్రభాకర్‌రెడ్డి, కాసాని శ్రీనివాసరావు, సోమ శ్రీనివాసరావు, వినయ్‌వర్ధన్, పాలంపల్లి రాజు ఉన్నారు.

వాటర్ ఫ్రిజ్ బహూకరణ

గరిడేపల్లి : వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పోలీసులతో పాటు వివిధ పనుల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారికి దాహార్తి తీర్చేందుకు రూ.10 వేల విలువ గల వాటర్ ఫ్రిజ్‌ను బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ పోలీస్ స్టేషన్‌కు బుధవారం బహూకరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కొండల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



జానలదిన్నలో ఉపాధి హామీ మస్టర్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరయ్య

నేరేడుచర్ల : జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ శంకరయ్య అన్నారు. బుధవారం మండలంలోని వైకుంఠాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని జానలదిన్నలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని, సమోదు పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధి కూలీలు తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గరిడేపల్లి : మండలంలోని ముత్యాలనగర్‌లో శ్రీరామాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా బుధవారం గణపతి పూజ, యంత్ర స్థాపన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కాగా ఆలయాన్ని ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ద్రోణా సుబ్రహ్మణ్యశర్మ, రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, రాళ్లబండి రాజశేఖర్‌శర్మ, రాయప్రోలు భద్రయ్యశర్మ, సాయిశర్మ, మోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన నూర్జహాన్‌కు మంజూరైన రూ.60 వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కె.శ్రీను, జె.శంభయ్య, నాయకులు దుర్గాప్రసాద్, దీప, బురాన్, రాము, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ నవీన్‌కుమార్

నేరేడుచర్ల: రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌ఐ నవీన్‌కుమార్ అన్నారు. ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి వద్ద నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. షీటీమ్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, మహిళలు, పిల్లల భద్రతపై అవగాహన కల్పించారు. ముందుగా పోలీస్ కళా బృందం చే ప్రదర్శన ద్వారా వివరించారు. అదేవిధంగా సెల్‌ఫోన్ల వాడకం, సోషల్ మీడియా తదితర అంశాలను తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో చిల్లేపల్లి సర్పంచ్ మనోజ్‌కుమార్, సూర్యాపేట షీటీమ్ ఎస్‌ఐ పాండునాయక్, హెడ్ కానిస్టేబుల్ జాఫర్, యల్లారెడ్డి, పోలీస్ కళా బృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, నాగార్జున, కృష్ణ, గురులింగం ఉన్నారు.

గ్రామాల్లో క్రీడా మైదానాల జాడేదీ

- 29 గ్రామ పంచాయతీలకు గాను 4 గ్రామాల్లోనే ఏర్పాటు
- స్థలాలు గుర్తించడంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- నిర్మించిన మైదానాల్లో సౌకర్యాలు కరువు



మామిళ్లగూడెంలో రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

మోతె : గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని పెట్టుకున్న లక్ష్యం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది. మోతె మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా నాలుగు గ్రామ పంచాయతీల్లోనే అధికారులు నామమాత్రంగా ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. మిగతా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలకు కనీసం స్థలం సేకరించిన దాఖలాలు లేవు. గ్రామాల్లో ప్రభుత్వం భూములున్నా అధికారులు ప్రభుత్వ స్థలాలను గుర్తించకపోవడంతో క్రీడా ప్రాంగణాల నిర్మాణం మరుగున పడిపోతోంది.

బోర్డులు పెట్టారు.. మరి సౌకర్యాలు

మండలంలో 29 గ్రామ పంచాయతీలకు గానూ మోతె, మామిళ్లగూడెం, విభళాపురం, అన్నారిగూడెం గ్రామాల్లోనే క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. ఈ మైదానాల్లో నామమాత్రంగా మట్టిపోసి చదును చేశారు. అనంతరం మైదాన ప్రదేశాల్లో ఆకర్షణీయంగా బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారు. మామిళ్లగూడెం గ్రామంలో రూ. 22 లక్షలతో నిర్మించిన రైతు వేదిక ప్రాంగణంలోనే క్రీడా మైదానం ఏర్పాటు చేశారు. క్రీడా మైదానం పేరుతో రైతు వేదిక స్థలంలోనే బోర్డు ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధులు, అధికారులు సొమ్ము చేసుకున్నారని ఆ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే గ్రామ పంచాయతీల్లో ఒక్కో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు రూ.4 లక్షలు ఈజీఎస్ నిధులను వాడుకొనే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కల్పించింది. ఈ నిధులతో మైదానాల చదును, పరికరాల ఏర్పాటు, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంపు కోర్టులు ఏర్పాటు చేయాలి. మైదానం చుట్టూ మొక్కలు నాటాలి. కానీ ఇవి ఏమి ఏర్పాటు చేయకుండా క్రీడా ప్రాంగణాలు అని బోర్డులు పెట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. కొన్ని గ్రామాల్లో పాఠశాలల్లో కొద్ది పాటి ఖాళీ స్థలాలను చదును చేసి క్రీడా ప్రాంగణాల పేరిట బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారించి వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.

స్థలాలు గుర్తించలేదు

మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో కేవలం 4 పంచాయతీల్లోనే క్రీడా మైదానాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మిగిలిన 25 గ్రామాల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని గుర్తించలేదు. అంతేకాకుండా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు నేటికీ బిల్లులు రాకపోవడంతో సంబంధిత సర్పంచ్‌లు క్రీడా మైదానాల ఏర్పాటుకు ముందుకు రావడం లేదు.

– ఎంపీడీఓ వెంకటాచారి

సహకార సంఘాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతంతోనే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని, సహకార సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వేపలసింగారంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోడౌన్‌ను బుధవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సీఈఓ కోల్ల మదన్‌మోహన్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. సహకార సంఘాల ద్వారా రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు, ఎరువులు, పురుగుమందులు అందజేయడంతో పాటు రైతులు తమ ధాన్యం నిల్వ చేసుకునేందుకు పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో గోడౌన్‌లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వేమూలూరి రంగాచారి, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, సీతారాంరెడ్డి, డైరెక్టర్లు, రైతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నేరేడుచర్ల : పత్తేపురం రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి దంపతులు

నేరేడుచర్ల : తెలంగాణలో ఆలయాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. మండలంలోని పత్తేపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, ఎంపీటీసీ మండల రాజేష్, సర్పంచ్ మచ్చబాబు, నాయకులు సోమిరెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, వెంకన్న, సైదిరెడ్డి ఉన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ తీగల మోహన్‌రావు

నేరేడుచర్ల : నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ తీగల మోహన్‌రావు అన్నారు. బుధవారం ఆయన నేరేడుచర్ల లయన్స్ క్లబ్‌ను సందర్శించి, అనంతరం నిర్వహించిన అభినందన సభలో పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా 214 దేశాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ మైల్డ్ స్టోన్ అవార్డు పొందిన నేరేడుచర్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యడవల్లి సత్యనారాయణరెడ్డి, సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు. 2022-23 సంవత్సరానికి జోన్ చైర్మన్ బట్టు మధు చేపట్టిన కార్యక్రమాల ద్వారా బెస్ట్ జోన్ చైర్మన్ అవార్డును అందజేశారు. అనంతరం మండలంలోని పెంచికల్‌దిన్నలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి క్లబ్ పూర్వ అధ్యక్షుడు పోరెడ్డి శ్రీరాంరెడ్డి సౌజన్యంతో కుట్టు మిషన్లు, అనాథ వృద్ధ మహిళలకు సరుకులు, బియ్యం, జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ క్యాబినేట్ జెల్లా దశరథ, సభ్యులు కొణతం సీతారాంరెడ్డి, సుంకరి క్రాంతికుమార్, అంజయ్య, శ్రీనివాస్‌రావు, సైదులు, ప్రభాకర్‌రెడ్డి, రామస్వామి, సూర్యనారాయణరెడ్డి, సైదులునాయక్, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

మునగాల : ఉపాధి హామీ పథకం కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చందా చంద్రయ్య కోరారు. బుధవారం మండలంలోని గణపవరంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉపాధి కూలీలకు సంవత్సరానికి 250 రోజులు పనిదినాలు కల్పించి, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా రోజువారి వేతనం రూ.600 లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీలకు బ్యాంకుల ద్వారా కాకుండా పోస్టాఫీస్ ద్వారా కూలి డబ్బులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం మేట్లు బి.ప్రమీల, సరిత, షేక్ సర్దార్, ఎస్.మహేష్, కె.గంగ, బి.వెంకటయ్య, ఎం.ధనమూర్తి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ఐఎన్‌టీయూసీ కృషి



కేక్ కట్ చేస్తున్న ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : కార్మిక సంక్షేమంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి నిరంతరం పాటుపడేది ఐఎన్‌టీయూసీ మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగని నాగన్నగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాముల శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరా భవన్‌లో ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఐఎన్‌టీయూసీ జెండాను ఎగుర వేసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం సీనియర్ కార్మికులు ఆదే మురళి, తోట లక్ష్మయ్య, తుమ్మల సైదులు, జానయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, నాయకులు పి.రామరాజు, జె.మల్లయ్య, బి.గిరిబాబు, కె.వెంకన్న, కె.మహేష్, సుదర్శన్, ముస్తఫా, బెంజిమెన్, రాము, కె.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భరోసా సభ పోస్టర్ ఆవిష్కరణ



బీఎస్పీ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధికార ప్రతినిధి సాంబశివగౌడ్, నాయకులు

హుజూర్‌నగర్ : బీఎస్పీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో మే 7న నిర్వహించే తెలంగాణ భరోసా బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ డి.సాంబశివగౌడ్, రాష్ట్ర నాయకుడు డి.శ్రీనివాస్ యాదవ్ కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లో స్థానిక నాయకులతో కలిసి సభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ బహిరంగ సభకు ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని చెప్పారు. బూత్ స్థాయి నుంచి బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మంద రవి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దపంగ ఉపేందర్, నియోజకవర్గ నాయకులు సుబ్బుగౌడ్, జె.రామస్వామి, ఎస్.గోవింద్, హుస్సేన్, ఎం.మట్టపల్లి, వి.కరుణాకర్, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కార్యదర్శుల సమ్మెకు పలువురి మద్దతు



చిలుకూరులో జేపీఎస్‌ల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది



కోదాడరూరల్ : జేపీఎస్‌లకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

చిలుకూరు : బాధ్యతలు చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయినందున తమను రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా చేపట్టిన సమ్మె బుధవారం ఆరవరోజుకు చేరింది. సమ్మెకు గ్రామ పంచాయతీ వర్కర్లు, సిబ్బంది సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అశోక్ వర్మ, సారిక, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రామారావు, శోభన్‌బాబు, కార్తిక్, కవిత, నవీన్, అవినాష్‌రెడ్డి, అంజయ్య, ప్రవళిక, సౌమ్య, ఆకాంక్ష, రాము తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సీఐటీయూ మద్దతు

కోదాడరూరల్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.ముత్యాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ కార్యదర్శులు చేస్తున్న నిరవధిక సమ్మెకు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మద్దతు ప్రకటించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, పద్మావతి, నాగలక్ష్మి, కావ్య, జీవిత, కవిత, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

నేరేడుచర్ల : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి డిమాండ్ చేశారు. నేరేడుచర్లలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్న సమ్మెకు బుధవారం ఆయన సీఐటీయూ తరపున మద్దతు తెలిపి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వారం రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె.నగేష్, నాయకులు సైదులు, ఏసు తదితరులు ఉన్నారు.



మఠంపల్లిలో జేపీఎస్‌ల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సయ్యద్ రన్‌మియా

మఠంపల్లి : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నాలుగు సంవత్సరాల సర్వీస్‌ను పూర్తిచేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్‌రన్‌మియా కోరారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆరు రోజులుగా శాంతియుత సమ్మె చేపడుతున్న జేపీఎస్‌ల దీక్షకు సీఐటీయూ సంఘం పక్షాన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో జేపీఎస్‌ల మండల అధ్యక్షుడు బండారు చంటి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, నరేందర్‌రెడ్డి, రాజా, నాగరాజు, నరేష్, విజయ, కవిత, నారమ్మ, సరిత, నాగిరెడ్డి, మహేష్, అంజన్, చిన్నసైదులు, తదితరులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న రామ్మూర్తి

కార్మికులకు అండగా ఎర్ర జెండా



గరిడేపల్లి : మంగాపురంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



మునగాల : మే డే వేడుకల్లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

గరిడేపల్లి : కార్మికులకు ఎర్ర జెండా అండగా నిలుస్తుందని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని ఫరెడ్డిగూడెంలో ఆ పార్టీ నాయకుడు యడవల్లి వెంకటేశ్వర్లు నాయకత్వంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక జెండాను పార్టీ సీనియర్ నేత లక్క నర్సయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు యడవల్లి వెంకటేశ్వర్లు, ఇంజమూరి సోమయ్య, రాములు, సైదులు, నర్సయ్య, ఇన్న య్య, అంజయ్య, వీరస్వామి, గోవిందు పాల్గొన్నారు.

సీపీఐ (ఎంఎల్)ఎన్‌డీ ఆధ్వర్యంలో..

మండలంలోని మంగాపురంలో బుధవారం సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో కార్మిక జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామల్ల నవీన్, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, నాగేశ్వర్‌రావు, నాగరాజు, వెంకటేశ్వర్లు, వెంకన్న పాల్గొన్నారు.

జగన్నాథపురంలో..

మునగాల : మండలంలోని జగన్నాథపురంలో బుధవారం సీపీఎం గ్రామ శాఖ, సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రజెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ, హమాలీ, రైతు సంఘం నాయకులు షేక్ సైదా, వీరబోయిన వెంకన్న, ఖాజాబీ, భూతం వెంకన్న, వీరబాబు, నబీసాహెబ్, నాగుల్‌మీరా, బుచ్చాలు, మోహన్‌బాబు, కొమరయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో నైపుణ్యం సాధించాలి



మునగాల : బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వీరమ్మ

మునగాల : యువత, విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం సాధించి భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని బరాఖత్‌గూడెం సర్పంచ్ కొప్పుల వీరమ్మ కోరారు. బుధవారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అశోక్ ఏర్పాటు చేసిన ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ ఓరుగంటి రవి, మాజీ సర్పంచ్ నరాల రుక్మారావు, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



నడిగూడెం : అథ్లెట్స్‌తో ఎస్‌ఐ, పీఈటీలు

అథ్లెటిక్ వేసవి శిబిరం ప్రారంభం

నడిగూడెం : విద్యార్థులు, యువత వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ ఏడుకొండలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అథ్లెటిక్ వేసవి క్రీడా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో గడ్డం వెంకటేశ్వర్లు, లొడంగి సైదులు, ప్రకాష్, నాగేశ్వరరావు, హరీష్, వీరేష్, వంశీ, సాయి ఉన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



నేరేడుచర్ల : ఏఐవైఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న చిలకరాజు శ్రీను



చిలుకూరులో జెండా ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండలు

చిలుకూరు : చిలుకూరులో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ మరిచిందని, నిరుద్యోగ యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయనున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి సాహెబ్ అలీ, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల రాము, కడారు మధు, బాలెబోయిన మహేష్, కాసాని అంజిబాబు, మండవ అచ్చయ్య, నాగేశ్వరరావు, శ్రీను, ఎల్లయ్య, జాన్‌పాషా, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : అఖిల భారత యువజన సమాఖ్య 64వ వార్షికోత్సవాన్ని బుధవారం నేరేడుచర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎస్‌కే మధార్, శేఖర్, బ్రహ్మం, లింగాచారి, ఉపేందర్, కృష్ణయ్య, రమేష్ ఉన్నారు.

ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలి



బీల్యానాయక్‌తండా ఐకేపీ కేంద్రంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు

మఠంపల్లి : మండలంలోని ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కాంటాళ్లు వేసి నెల రోజులు దాటినా బస్తాలు మిల్లులకు తరలించకపోవడంతో కురుస్తున్న వర్షాలకు ధాన్యం మొలకలు వస్తున్నాయని, వెంటనే లారీలు ఏర్పాటు చేసి ధాన్యం బస్తాలను తరలించాలని కాంగ్రెస్ మండల ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బీల్యానాయక్‌తండా ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాబునాయక్, ఎంపీటీసీ శౌరీనాయక్, సర్పంచ్ గోవిందునాయక్ తదితరులు సందర్శించారు. దీంతో రైతులు ధాన్యం బస్తాలు తడిసిపోతున్నాయని గోడు వెళ్లబోసుకున్నారు. ఉపసర్పంచ్ సైదానాయక్, తార్యా, బుజ్జానాయక్, సోమానాయక్, వెంకటేశ్వర్లు, సైదా, చందా పాల్గొన్నారు.

వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేసేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు

మునగాల : ఐకేపీ కేంద్రాలతో పాటు ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. జాతీయ రహదారి పక్కన తాడువాయి గ్రామ శివారులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఈ కేంద్రానికి కేటాయించిన మండల కేంద్రంలో గల బాలాజీ రైస్‌మిల్లును సందర్శించారు. మిల్లులో ధాన్యం బస్తాల దిగుమతులు త్వరగా అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని మిల్లు యాజమానులు, హమాలీలకు కలెక్టర్ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వారికి హామీ ఇచ్చారు. మరో వారం రోజులలో పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట పలువురు మండల స్థాయి అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామ శివారులో మచ్చ సైదులుకు చెందిన పాడిగేదె మేతకోసం వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలాయి. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ పాడిగేదె రూ. 50వేల విలువ చేస్తుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.